క్లుప్తంగా

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీం నియామకం

చీరాల టౌన్: నియోజకవర్గంలో ఎన్నికల నియమావళిని సక్రమంగా అమలు చేసేందుకు ఈసీ ఆదేశాల మేరకు ముగ్గురు అధికారులతో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీంను ఏర్పాటు చేశామని నియోజకవర్గ ఎన్నికల అధికారి జి.సూర్యనారాయణరెడ్డి సోమవారం తెలిపారు. నియోజకవర్గ ఎన్నికల నియమావళి బృందంలో చీరాల మున్సిపల్ కమిషనర్ కె.చక్రవర్తి (98499 07327), చీరాల ఎంపీడీవో ఎం.శోభారాణి (87126 55958), వేటపాలెం ఎంపీడీవో కార్యాలయం ఏవో శర్మ (97036 51333) సభ్యులుగా ఉన్నారన్నారు. ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు, తదితర సమాచారాన్ని అధికారులకు తెలియజేయాలని ఆర్వో సూచించారు.

కొనిదెనలో వైభవంగా ప్రతిష్ట వేడుకలు



హోమాల్లో పాల్గొన్న భక్తులు

బల్లికురవ: కొనిదెన గ్రామంలోని బ్రహ్మగుండం వద్ద ప్రతిష్ఠించిన ఆదిత్యాది నవగ్రహ ప్రతిష్ఠ 41 వరోజు వేడుకలు సోమవారం వైభవంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, గణపతి, నవగ్రహ హోమం నూతనంగా ఏర్పాటు చేసిన నవగ్రహాలకు పంచామృతాలతో అభిషేకం, ప్రత్యేక అలంకరణ, అర్చన, మహాపూర్ణాహుతి, ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల వితరణ చేపట్టారు. వేడుకల్లో గ్రామంలో పాటు పరిసర గ్రామాల భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో భక్తులకు సౌకర్యం కలగకుండా ఏర్పాటు చేపట్టారు.

విద్యార్థులకు మెటీరియల్ పంపిణీ



పుస్తకాలు అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

పర్చూరు (చినగంజాం): మండలంలోని కొమర్నేని వారిపాలెం ఎంపీయూపీ స్కూల్ ప్రభుత్వ పాఠశాల నందు విద్యార్థులకు పర్చూరు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం మెటీరియల్ అందజేశారు. పాఠశాలలో 1 నుంచి 8వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులందరికీ రోటరీ క్లబ్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రి, చిన్నపిల్లలకు పలకలు, పుస్తకాలు పంపిణీ చేశారు. దాతలు నాగబైరు జాన్వికకు పాఠశాల హెచ్ఎం బీవీ శ్రీనివాసరావు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా సహాయం చేసినందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మున్నంగి వెంకట సుబ్బయ్య,క్లబ్ కార్యదర్శి పంబి సదానంద రెడ్డి, రోటరీ సిబ్బంది అడ్డగవ శివరామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెరిగిన పంచాయతీ మార్కెట్ వేలం

చినగంజాం: మండలంలోని కొత్తపాలెం పంచాయతీకి సంబంధించి 2024–25 ఆర్థిక సంవత్సరంలో కూరగాయలు, చేపల మార్కెట్ వేలం పాట సోమవారం పంచాయతీ కార్యాలయంలో ఆవరణలో నిర్వహించారు. ఈఓపీఆర్డీ ఎస్ వేణుగోపాల కృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన వేలం పాటనందు పంచాయతీ పరిధిలోని పలువురు ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొన్నారు. గ్రామానికి చెందిన పలపట్ల నాగరాజు రెడ్డి మార్కెట్ పాటను రూ.3.10 లక్షలకు దక్కించుకున్నారు. గత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ వేలం పాట రూ 2.96 లక్షలు కాగా ఈ ఏడాది రూ.14 వేలు పెరిగింది. దీని ప్రకారం వేలం పాట దక్కించుకున్న వారు కొత్తపాలెం పంచాయతీ పరిధిలోని కూరగాయలు, చేపల మార్కెట్‌లో వ్యాపారుల దగ్గర నుంచి ప్రతి రోజు రుసుము వసూలు చేసుకొని పంచాయతీకి చెల్లించాల్సి ఉంది. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కే బాబురావు, బిల్ కలెక్టర్ రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శింగరకొండ దర్శిని

అద్దంకి: శోభకృతు నామ సంవత్సరం, ఉత్తరాయనం, ఫాల్గుణమాసం, పూర్వాషాఢ నక్షత్రం ,అష్టమి తిథి సందర్భంగా మంగళవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ సుభద్ర సోమవారం తెలిపారు. క్షేత్రప్రాధాన్యం ఉన్న మంగళవారం ఆంజనేయ స్వామికి ఇష్టమైన ఆకుపూజ చేస్తే కోరిన కోర్కెలు నెరవేరుతాయని చెప్పారు. ఉదయం బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు సువర్చలా సహిత దక్షిణాభిముఖ ప్రసన్నాంజనేయ స్వామి ఉత్సవ మూర్తులకు పల్లకీ సేవ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

నోటికాడి కూడు లాక్కున్నారు.. !

చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాల్సిందే..



పీ కోటిరెడ్డి, కొత్తపాలెం

జగన్‌బాబు పుణ్యమా అంటూ పింఛన్‌ను వలంటీర్‌లు నేరుగా ఇంటికి తెల్లారకముందే తెచ్చి ఇస్తున్నారు. పంచాయతీకి వెళ్లి పొద్దుటి నుంచి సాయంత్రం వరకు కాచుకొని ఉండాల్సిన పని లేకుండా మా శ్రమ ఆయన తగ్గించాడు. ఇప్పుడేమో వలంటీర్‌ల ద్వారా పింఛను ఇవ్వడం కుదరదంటున్నారు. ఒంట్లో సత్తువ లేకపోగా ఉదయం వెళ్లి ఎండలో పంచాయతీ కార్యాలయం దగ్గర ఉండాలంటే కష్టమే మరి. మమ్ములను ఈ పరిస్థితికి తెచ్చిన చంద్రబాబుకు తగిన గుణపాఠం చెప్పాల్సిందే.

సాక్షి నెట్‌వర్క్: నెల ఒకటో తేది వచ్చిందంటే ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ అందించే వలంటీర్ ఇక రాడు. ఐదేళ్లలో ముసలి, ముతక, పేద, మధ్యతరగతి కుటుంబాల్లో ఒకరిగా ఉంటూ సేవలందించే వలంటీర్ ఇక మూడు నెలలు కనిపించడు. ఎందుకంటే కుట్రతో తెలుగుదేశం పార్టీ, మరికొందరు పెద్దల ముసుగులో ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వలంటీర్ సేవలు ఆగిపోయాయి. ఫలితంగా పింఛన్‌దారుల ఇక్కట్లు మళ్లీ మొదటికొచ్చాయి. ఈఐదేళ్ల హాయిగా తెల్లారే పింఛన్ తీసుకొని ఆనందంగా గడిపారు. చంద్రబాబు చేసిన కుట్రతో మానోటికాడి కూడు లాక్కున్నారని.. మళ్లీ ఇబ్బందులు మొదలయ్యాయని పలువురు లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వృద్ధురాలికి పింఛన్ అందిస్తున్న వలంటీర్ (ఫైల్)

చంద్రబాబు ఏమి లాభం పొందాలనో.. ?



ఎడవల్లి సుధాకర్, కోలలపూడి

మా లాంటి దివ్యాంగులకు దేవుడు ప్రసాదించినట్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ఎంతో మేలు చేశాడు. ప్రతి నెల ఒక గవర్నమెంట్ ఉద్యోగికి జీతం అందిన విధంగా మొదటి తారీఖునే పింఛను అందుకోవడం మాలో ఆత్మవిశ్వాసం పెరిగింది. అటువంటి వలంటీర్ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు చంద్రబాబు కంకణం కట్టుకున్నాడు. సచివాలయం దగ్గరకు వెళ్లి ఎంత సమయం పింఛను కోసం వేచి ఉండాలో భయమేస్తుంది.

ప్రభుత్వం చేసే మంచి పనులను ఓర్వలేకనే..



చల్లా అప్పిరెడ్డి, ఆదిపూడి

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల పక్షన ఉండి వారికి అవసరమైన అన్ని సేవలను వలంటీర్ల ద్వార అందిస్తుంటే వాటని ఎదుర్కొనే అవకాశం లేని ప్రతిపక్షల కుట్రతోనే నేడు వలంటీర్లకు పింఛన్ పంపిణీ పనులను తొలగించారు. గత ప్రభుత్వ పాలనలో వృద్ధులు, వికాలాంగులు పింఛన్‌ల కోసం ఎంతగా పడిగాపులు పడ్డారో మేమంతా చూశాం. ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితులు వస్తే గ్రామాల్లో లక్షలాది మంది లబ్ధిదారులు, పేదలు ఎన్నో అవస్థలు పడతారు.

జగన్‌ను మళ్లీ సీఎం చేసేందుకు నడుం బిగిస్తాం..



వెంకటేశ్వర్లు, పందిళ్లపల్లి

మా బిడ్డ లాంటి జగన్ పాలనలో ఇప్పటి వరకు వలంటీర్ వచ్చి తెల్లవారు జామునే ఇంటి వద్దనే పింఛను ఇచ్చి వెళ్లేవాడు. అదే మాదిరిగా ఈ రోజు పింఛను వస్తుందని ఆశ పడ్డాను. వలంటీర్‌ను అడగ్గా చంద్రబాబు కుట్రపన్ని వలంటీర్లను తీసి వేయించాడని తెలిపాడు. ఇప్పుడు మళ్లీ మేము ఈ వయసులో పంచాయతీ వద్దకు వెళ్లి పడిగాపులు కాయాల్సి పరిస్థితి వచ్చింది. దేవుడు చూస్తున్నాడు.. ఎవరు మంచి వాళ్లో ఎవరు చెడ్డవాళ్లో గమనిస్తున్నాడు.

మేమేం పాపం చేశాం చంద్రబాబూ..



పసుపులేటి అంకమ్మ, పూనూరు

పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్న వలంటీర్ల సేవలను నిలిపివేయటం దారుణం. ప్రతి నెల 1వ తేదీనే ఇంటికి వచ్చి వృద్ధులకు, దివ్యాంగులకు ఫించన్లు అందిస్తున్న వారి సేవలను చంద్రబాబు కపటబుద్ధితో ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం సమంజసం కాదు. కరోనా కాలంలో కూడా బంధువులు, ఇరుగుపోరుగువారు సైతం దగ్గరకి రాని పరిస్థితుల్లో మేమున్నాం అంటూ వలంటీర్లు చేసిన సేవలు వెలకట్టలేనివి.

బాలాజీని భారీ మెజార్టీతో గెలిపించాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే కరణం, అసెంబ్లీ అభ్యర్థి కరణం



ఇఫ్తార్ విందులో భాగంగా భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే కరణం, బాలాజీ

- అభిమానులు, కార్యకర్తలకు ఎమ్మెల్యే కరణం బలరాం పిలుపు
- నాయకుల సమక్షంలో 40 కుటుంబాలు పార్టీలో చేరిక

మార్టూరు: నిజాయితీ పరుడు, విలువలు కలిగిన నాయకుడు, సమర్థుడైన యడం బాలాజీని పర్చూరు నియోజకవర్గంలోని తన అభిమానలు, పార్టీ కార్యకర్తలు వచ్చే ఎన్నికలలో భారీ మెజార్టీతో గెలిపించి అసెంబ్లీకి పంపించాలని చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి మార్టూరులో ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో యడం బాలాజీతో పాటు ముఖ్య అతిథిగా కరణం బలరాం పాల్గొన్నారు. ఈసందర్భంగా ఇరువురు నాయకులు కొణిదెన రోడ్డులోని మదీనా మసీదులో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. అనంతరం గన్నవరం రోడ్డులో నిర్వహించిన ఇఫ్తార్ విందులో బాలాజీ, బలరాంలు స్వయంగా ముస్లిం మహిళలకు భోజనం వడ్డించారు. అనంతరం బలరాం విలేకరులతో మాట్లాడుతూ బాలాజీ తనకు చిన్నతనం నుండి తెలిసిన వ్యక్తి అని మంచి విలువలు కలిగిన రాజకీయ నేపథ్య కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తి అని తన అభిమానులంతా బాలాజీకి మద్దతుగా నిలిచి ఎమ్మెల్యే గెలిపించాలని పిలుపునిచ్చారు. త్వరలో తాను నియోజకవర్గంలో పర్యటిస్తానని, బాలాజీ గెలుపు కోసం కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా స్థానిక ముస్లింలు 40 కుటుంబాల వారు వైఎస్సార్ సీపీలో చేరడంతో బాలాజీ, బలరాంలు వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు.

బాలాజీని కలిసిన మహిళా జెడ్పీటీసీలు



యడం బాలాజీతో మాట్లాడుతున్న మహిళా జెడ్పీటీసీలు

చినగంజాం: పర్చూరుల వైఎస్సార్ సీపీ అసెంబ్లీ అభ్యర్థి యడం బాలాజీని నియోజకవర్గంలోని నాలుగు మండలాల మహిళా జెడ్పీటీసీలు సోమవారం ఆయనను కలిశారు. నియోజకవర్గంలోని మార్టూరు జెడ్పీటీసీ, వైస్ చైర్మన్ చుండి సుజ్ఞానమ్మ, చినగంజాం జెడ్పీటీసీ ఆసోది భాగ్యలక్ష్మి, కారంచేడు జెడ్పీటీసీ యార్లగడ్డ రజిని, యద్దనపూడి జెడ్పీటీసీ చుండి లక్ష్మీనారాయణమ్మలు ఆయనను కలిశారు. మార్టూరు మండలంలోని వలపర్ల గ్రామంలో ఎన్నికల ప్రచారాన్ని చేపట్టిన యడం బాలాజీని వారు కలిసి తమ మద్దతు తెలియజేశారు. తమ మండలాలో పార్టీ గెలుపు కోసం తమవంతు కృషి చేస్తామని, మెజార్టీ ఓట్లు సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతామని వారు ఆయనకు భరోసా ఇచ్చారు.

ఈ శిలాఫలకాలకు ఎన్నికల కోడ్ వర్తించదా



యథేచ్ఛగా దర్శనమిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే శిలాఫలకాలు

బల్లికురవ: ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చి 16 రోజులైంది. బల్లికురవ మండలంలోని కొప్పెరపాడు గ్రామ సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్, నారాలోకేష్ పేర్లతో శిలాఫలకాలు యథేచ్ఛగా దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీకి సంబంధించిన శిల ఫలకాలు, జెండాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించిన అధికారులు ప్రతి పక్షాల శిలాఫలకాలను గ్రామంలో దర్శనమిస్తున్నా ఎలాంటి స్టిక్కర్లు అంటించకపోవటం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మూడు పార్టీ కూటమికి సైతం అధికారులు కొమ్ముకాస్తున్నారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ముద్దపాటి శంకర్ తన అక్కా, బావలను చూసేందుకు ఇంటికి వచ్చి మేనల్లుడు దానారావుతో ఫోటో దిగితే ఎల్లో మీడియా కట్టుకథ అల్లి సస్పెండ్ చేసిన అధికారులకు శిలాఫలకాలు కనబడటంలేదా గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు.

మూకుమ్మడిగా వలంటీర్ల రాజీనామాలు



రాజీనామా చేసిన అనంతరం హనిమిరెడ్డిని కలిసిన వలంటీర్లు



వైఎస్సార్ సీపీ నాయకుడు నరసింహారెడ్డిని కలిసిన వలంటీర్లు



ఎంపీడీఓకు రాజీనామా లేటర్ ఇస్తున్న వలంటీర్ నజీర్

అద్దంకి/జే.పంగులూరు: వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గౌరవ వేతనం తీసుకుని, ఐదేళ్ల పాటు కులమత వర్గ పార్టీ రహితంగా సేవలందించిన వలంటీర్ల వ్యవస్థపై టీడీపీ బురద జల్లడాన్ని వలంటీర్లు సహించలేకపోతున్నారు. దీంతో సోమవారం స్వచ్ఛందంగా మండలంలోని చిన్నకొత్తపల్లి, ధర్మవరం గ్రామ వలంటీర్లతోపాటు తిమ్మాయపాలెం గ్రామానికి చెందిన ఒక వలంటీర్లు రాజీనామా చేశారు. మనలా వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సీఎం అయిన తరువాత విధుల్లో చేరి ప్రజలకు సేవలందిస్తామనే నమ్మకం ఉందని చెప్పారు. ఐదేళ్లపాటు ప్రజాసేవ చేసే భాగ్యం కల్పించిన సీఎం జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. వారిని వైఎస్సార్ సీపీ అద్దంకి ఎమ్మెల్యే అభ్యర్థి పానెం చిన హనిమిరెడ్డి, మండల కన్వీనర్ గుజ్జుల జగన్‌మోహన్‌రెడ్డి, అవిశెన ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి స్థానిక నాయకులు అభినందించారు.

– జే.పంగులూరు మండల పరిధిలోని రామకూరు గ్రామంలో గ్రామానికి చెందిన వలంటీరు షేక్ నజీర్ సోమవారం తన వలంటీరు పదవికి రాజీనామా చేశాడు. సోమవారం ఎంపీడీవో మాధ్యూబాబుకి తన రాజీనామా పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ స్వయంపు హనుమంతురావు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో కేంద్ర బలగాల కవాతు



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ

అద్దంకి రూరల్: ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రజలు సహకారం అందించాలని సీఐ పీ. కృష్ణయ్య అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని ధేనువుకొండ, పేరాయపాలెం, మోదేపల్లి, కుంకుపాడు, కొటికలపూడి గ్రామాల్లో కేంద్రా పోలీస్ బలగాలతో కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల్లో అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా తగిన చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అద్దంకి ఎస్సైలు నాగరాజు, రత్నకుమారి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఓటు వేసేందుకు రాలేని వారిని గుర్తించాలి



బీఎల్వోల సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్ఓ సుబ్బయ్య



సమావేశంలో మాట్లాడుతున్న యద్దనపూడి తహశీల్దారు నాగరాజు



పర్చూరులో మాట్లాడుతున్న ఆర్డీఓ, ఆర్ఓ

పర్చూరు (చినగంజాం)/యద్దనపూడి: ఓటర్లలో ఓటు వేయడానికి రాలేని వృద్ధులు, వికలాంగులను గుర్తించాలని పర్చూరు అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య అన్నారు. పర్చూరు మండలంలోని బూత్ లెవెల్ అధికారుల సమావేశం సోమవారం స్థానిక క్రీడా వికాస కేంద్రంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్చూరు మండలంలో 85 ఏళ్లు నిండిన ఓటర్లు మరియు 40 శాతం పైబడిన వికలాంగులైన ఓటర్లకు ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఫారం -12 డీ పంపిణీ చేయాలని తెలియజేశారు. ఈ కారక్రమంలో పర్చూరు మండల పరిధిలోని సెక్టారు అధికారులు, సూపర్ వైజర్‌లు,అన్ని పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు హాజరయ్యారు.

– వయోవృద్ధులు, విభిన్నప్రతిభావంతులకు భారత ఎన్నికల సంఘం కల్పించిన హోమ్ ఓటింగ్ విధానాన్ని పటిష్టంగా అమలుచేయాలని యద్దనపూడి తహశీల్దారు ఎస్. నాగరాజు అన్నారు. సోమవారం తహశీల్దారు కార్యాలయంలో బీఎల్ఓలు, సెక్టారు ఆఫీసర్స్, సూపర్‌వైజర్స్‌తో ఓటునమోదు, పీడబ్ల్యూడీ (పార్సన్ విత్ డిజబిలిటీ) మార్కింగ్ హోమ్ ఓటింగ్ తదితర అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. 40 శాతం కంటే అంగవైకల్యం ఉన్న వారికి 80 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు ఇంటి దగ్గర నుంచి ఓటు వేసే సౌకర్యం కల్పించిందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దారు విష్ణుప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పర్చూరు (చినగంజాం): నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాలలోని 295 పోలింగ్ కేంద్రాల్లో 85 ఏళ్లు పైబడిన వృద్ధులు, 40 శాతం వికలత్వం కలిగిన దివ్యాంగ ఓటర్లను గుర్తించి వారికి ఫారం–12డీ పంపిణీ చేయాలని పర్చూరు ఆర్ఓ జీ రవీందర్ సూచించారు. సోమవారం పర్చూరు తహసీల్దార్ కార్యాలయంలో నియోజకవర్గంలోని రాజకీయ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు సీహెచ్ సుబ్బయ్య, మెహర్ బాబు, ఫణీంద్ర బాబు, ప్రమీల, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరయ్యారు.

పన్ను వసూళ్లలో ప్రథమ స్థానం

అద్దంకి: పన్ను వసూళ్లలో బాపట్ల జిల్లాలో అద్దంకి మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు మున్సిపల్ కమిషనర్ ఎం సత్యనారాయణ సోమవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు మేరకు జిల్లాలో అద్దంకితో పాటు బాపట్ల, చీరాల, రేపల్లె మున్సిపాలిటీలు ఉండగా అందులో అద్దంకి మున్సిపాలిటీ ప్రథమ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. మున్ముందు రాష్ట్రస్థాయిలో అద్దంకి ముందుండే విధంగా చూడాలని ఆయన అధికారులను కోరారు.

అద్భుతంగా నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: నాట్య గురువు, హెచ్ఆర్‌పీసీ ఆంధ్రప్రదేశ్ చైర్‌పర్సన్ డాక్టర్ లక్ష్మీశ్వేత ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం ఆరు గంటలకు స్థానిక రవిప్రియ మాల్ ఆవరణలో జరిగిన చిన్నారుల నృత్య ప్రదర్శన చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. సంప్రదాయ భక్తిగీతాలకు చిన్నారులు హావభావాలు, విన్యాసాలతో కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి ప్రశంసలు అందుకున్నారు. దేవతా పాత్రలలో చక్కగా అలరించారు. ఈసందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ మన తెలుగు సంప్రదాయ నృత్యం కూచిపూడి దేశంలో ఎంతో ప్రసిద్ధి పొందిందన్నారు. అలాంటి నాట్యాన్ని చిన్నారులు నేర్చుకొని కాపాడాలన్నారు. కార్యక్రమంలో మువ్వల అభిషేక్త, కీర్తి, దుర్గ శ్రీలక్ష్మి, ప్రియదర్శిని, చిన్నారులు పాల్గొన్నారు.



చిన్నారులను అభినందిస్తున్న ముఖ్య అతిథులు